క్లుప్తంగా

ట్రేడ్ లైసెన్సుల తనిఖీ



ఫుట్‌పాత్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో పలు ప్రాంతాల్లో గురువారం పర్యటించిన కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి దుకాణాల ట్రేడ్ లైసెన్సులను పరిశీలించారు. లైసెన్సులు లేకున్నా, రెన్యువల్ చేయించకపోయినా వెంటనే సిబ్బంది వద్ద తీసుకోవాలని సూచించారు. దుకాణాల ముందు ఉన్న ఫుట్‌పాత్‌లపై వాహనాలను నిలపరాదని, ఎటువంటి సామన్లు పెట్టొద్దన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఈ నవ్యజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ప్రహరీకి కన్నం

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో మన ఊరు.. మన బడి కార్యక్రమంలో భాగంగా నిర్మించిన ప్రహరీకి కన్నం పెట్టారు. ఆ ప్రాంతంలో ఉన్న కోళ్ల మేత కోసం పాఠశాల ఆవరణమే సరైందని భావించి ఏకంగా కన్నం పెట్టాడు.

బీసీలకు ఎంపీ సీటు కేటాయించాలి

ఖమ్మం మామిళ్లగూడెం: జనాభాలో 50 శాతం ఉన్న బీసీలకు ఖమ్మం ఎంపీ సీటు కేటాయించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. గురువారం ఖమ్మంలో జరిగిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ.. ఖమ్మం జిల్లా నుంచి ఒక్క ఎమ్మెల్యే కూడా బీసీలకు కేటాయించలేదని ఆరోపించారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా నాయకులు పిండిప్రోలు రామ్మూర్తి, రామాచారి, పుల్లయ్య, శ్రీనివాస్, రమణకుమార్, చంద్రశేఖర్, రాంబాబు, మహేశ్, ప్రకాశ్, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాలలో టైం మేనేజ్‌మెంట్‌పై గురువారం నుంచి ఐదు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. ఐసీటీ అకాడమి, పేపాల్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ శిక్షణ విద్యార్థులకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి.ధాత్రి, అకాడమిక్ డైరెక్టర్లు, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి భారత్ బంద్‌ను జయప్రదం చేయండి

ఖమ్మంసహకారనగర్/తిరుమలాయపాలెం: కేంద్ర ప్రభుత్వం రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ శుక్రవారం జరిగే గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని యూఎస్‌పీసీ, సీపీఎం, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు పిలుపునిచ్చారు. ఈనేపథ్యాన బంద్‌కు మద్దతుగా యూఎస్‌పీసీ ఆధ్వర్యాన నగరంలో ప్రదర్శన నిర్వహించి అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు ఏవి నాగేశ్వరరావు , ఎస్ విజయ్,యాదగిరి,మల్సూర్ పాల్గొన్నారు.

డీసీఓను కలిసిన 'ప్యాక్స్' ఉద్యోగ ప్రతినిధులు

ఖమ్మంవ్యవసాయం: జిల్లా సహకార అధికారి(డీసీఓ)గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన వంకాయలపాటి మురళీధర్‌రావును గురువారం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ(ప్యాక్స్)ల ఉద్యోగుల సంఘాల ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు. డీసీఓను కలిసిన వారిలో సహకార సంఘాల ఎంప్లాయీస్ రాష్ట్ర డిప్యూటీ సెక్రటరీ విప్పా శ్రీనివాసరావు, యూనియన్ అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరెడ్డి, ప్రతినిధులు దొడ్డ ముత్తయ్య, ఎస్.వెంకటేశ్వరరావు, మహ్మద్ ఆలీ, వై.శ్రీనివాసరావు, చంద్రం తదితరులు ఉన్నారు.

సీఐని కలిసిన డ్రైవర్ల సంఘం నాయకులు

ఖమ్మం సహకారనగర్: ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రభుత్వ డ్రైవర్ల సంఘం నాయకులు ఖమ్మం వన్‌టౌన్ సీఐ ఉదయ్‌కుమార్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండీ హకీమ్, జిల్లా ప్రధాన కార్యదర్శి టి.పంతులు పుష్పగుచ్ఛం అందించారు. ఈ నాయకులు బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో సెమినార్..

ఖమ్మంరూరల్: మండలంలోని కోదాడ క్రాస్‌రోడ్‌లో గల సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం అప్లికేషన్స్ ఆఫ్ స్టాటిస్టిక్స్‌అండ్ మ్యాథమెటిక్స్ అనే అంశంపై నేషనల్ సెమినార్ జరిగింది. ఈకార్యక్రమాన్ని ఉస్మానియా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ వీ.వీ. హరగోపాల్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం డేటా సైన్స్ అండ్ స్టాటిస్టిక్స్ అంశంపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎం.జ్ఞానేశ్వర్, డాక్టర్ కె.సంపత్‌కుమార్, ఎ.చందూలాల్, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రూస్సీరాణి తదితరులు పాల్గొన్నారు.

ఎండిపోతున్న చెరువు | ముంచుకొస్తున్న కరువు..

అడుగంటిన 'చెరువు'మాధారం..

- తాగు, సాగు నీటి కోసం అల్లాడుతున్న ప్రజలు
- వంద టన్నుల చేపలకు పొంచి ఉన్న ప్రమాదం
- పంటలను కాపాడుకునేందుకు రైతుల అవస్థలు
- ఎలాగైనా చెరువును నింపాలని స్థానికుల వేడుకోలు



ఎండిపోయిన చెరువుమాధారం చెరువు

నిత్యం జళకళతో కళకళలాడే చెరువు.. నేడు మునుపెన్నడూ లేనివిధంగా ఒట్టిపోయింది. దీంతో అటు తాగు నీటి కోసం ప్రజలు, ఇటు సాగు నీటి కోసం రైతులు నానా అవస్థలు పడుతున్నారు. అలాగే మత్స్య సొసైటీకి చెందిన దాదాపు 100 టన్నుల చేపలు నీరందక చనిపోయే ప్రమాదం ఉంది. చెరువుఅంతా ఇంకిపోవడంతో పలు గ్రామాల ప్రజలు, రైతులు నీటి కోసం ఎదురు చూస్తున్నారు.

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారం చెరువు దాదాపు 600 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ప్రస్తుతం ఏడారిని తలపించేలా ఇంకిపోయింది. కాగా, ఈ చెరువు మూలంగా చెరువుమాధారం, మంగాపురంతండా, రాయగూడెం, బైరవునిపల్లి, నాచేపల్లి, రాజారాంపేట, బుద్ధారం తదితర గ్రామాల్లో భూగర్భజలాలు పుష్కలంగా ఉండి నీటి కోసం ఇబ్బందులు ఉండేవి కావు. కానీ మునుపెన్నడూ లేనివిధంగా చెరువు అడుగంటింది. ఒకప్పుడు 10 అడుగుల వరకు నీటితో ఉండే చెరువు ప్రస్తుతం 2 అడుగులకే పరిమితం అయింది.

తాగునీటి కష్టాలు తప్పవా..?

చెరువుమాధారం చెరువుపై ఆధారపడిన పరిసర గ్రామాల్లో భూగర్భ జలాలతో నిత్యం నిండుకుండలా బావులు, బోర్లు ఉండేవి. ఇటీవల చెరువు పూర్తిగా ఎండిపోవడంతో ఆయా గ్రామాల్లో భూగర్భజలాలు అడుగంటి.. వేసవి కాలం రాకముందే తాగు, సాగు నీటికి కష్టాలు ప్రారంభమయ్యాయి. చెరువును నమ్ముకుని వ్యవసాయం సాగు చేస్తున్న రైతులు పంటలను కాపాడుకునేందుకు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు.

చేపల పరిస్థితి అగమ్యగోచరం..

చెరువుమాధారం మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యాన చెరువులో ఈ ఏడాది చేపల వేట సాగించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. కానీ తాజాగా కొంతమంది సభ్యులు వివిధ కారణాలతో స్టే తీసుకురావడంతో చేపల వేట నిలిచింది. గతంలో సంఘానికి ఎన్నికలు జరగకపోవడం, పలు కారణాలతో చేపలను వేటాడలేదు. దీంతో చేపలు భారీ స్థాయిలో బరువు పెరిగాయి. ప్రస్తుతం దాదాపు వంద టన్నుల చేపలు ఉన్నాయని, వాటి విలువ సుమారు రూ.కోటి వరకు ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. చేపల వేట కొనసాగకపోతే మత్స్య సొసైటీ సభ్యులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని మత్స్యకారులు వాపోతున్నారు.

రైతులను ఆదుకోవాలి..



పూర్తిగా ఎండిపోయిన చెరువుమాధారం చెరువును వెంటనే నీటితో నింపాలి. ఫలితంగా ఇటు సాగు, అటు తాగు నీటికి ఇబ్బందులు తప్పుతాయి. లేనిపక్షంలో రైతులు పంటలు పూర్తిగా ఎండిపోయి అప్పులపాలయ్యే అవకాశం ఉంది.

– భూక్యా సుధాకర్, మాజీ సర్పంచ్, మంగాపురంతండా

నీరు విడుదల చేయాలి..



వందలాది మంది మత్స్యకారులకు జీవనోపాధిగా ఉన్న చెరువు ఎండిపోవడంతో చేపలకు నీరందక చనిపోయే ప్రమాదం ఉంది. అధికారులు మత్స్యకారులను దృష్టిలో ఉంచుకుని నీటిని విడుదల చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– డి.రాధాకృష్ణమూర్తి, సొసైటీ ఉపాధ్యక్షుడు

చర్యలు తీసుకోవాలి..



చెరువుమాధారం చెరువుపై ఆధారపడిన గ్రామాల్లో తాగు నీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి. చెరువు పూర్తిస్థాయిలో ఎండినందున్న తాగు నీటి సమస్య వచ్చే అవకాశం ఉంది. అధికారులు వీలైనంతా త్వరగా తగు చర్యలు తీసుకోవాలి.

– ఈవూరి సుజాత, చెరువుమాధారం, మాజీ సర్పంచ్

తాగునీటి సమస్య రానివ్వొద్దు..

నేలకొండపల్లి: పంచాయతీల్లో తాగునీటి సమస్య రానివ్వకుండా అప్రమతంగా ఉండాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ ఓం ప్రకాశ్ పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. గురువారం ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ విభాగం అధికారులు సంయుక్తంగా పంచాయతీల్లో తాగునీటి సమస్యలపై పరిశీలించారు. ఈనేపథ్యాన మండలంలోని కోనాయిగూడెం గ్రామపంచాయతీని సందర్శించిన ఆయన మాట్లాడుతూ.. వేసవి సమీపిస్తున్నందున్న ముందస్తుగా అత్యవసర పనులను గుర్తించి వెంటనే చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తాగు నీరు కలుషితం కాకుండా చూడాలని, నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



వాటర్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న డీఈఈ

ఆయన వెంట మండల పంచాయతీ అధికారి సీహెచ్.శివ, పంచాయతీ కార్యదర్శి బోళ్ల వీరబాబు, సిబ్బంది బొడ్డు ఆంజనేయులు, కస్తాల గోపయ్య తదితరులు పాల్గొన్నారు.

బైరవునిపల్లి గ్రామదీపిక ఏకగ్రీవం

నేలకొండపల్లి: మండలంలోని బైరవునిపల్లి గ్రామదీపిక ఇటీవల మృతి చెందడంతో నూతన గ్రామదీపికను ఎన్నుకునేందుకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన సభ్యురాలు గోపి నాగలక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకోగా.. ఐకేపీ సీసీ వెంకటరమణ ఆమెను అభినందించారు. ఈ సమావేశంలో సర్కిల్ అధ్యక్షురాలు బొల్లికొండ శ్రీలత, సుభద్ర, పద్మ, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పీజీటీగా రాజారం యువకుడు..

తిరుమలాయపాలెం: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గురుకుల నియామకాల ఫలితాల్లో మండలంలోని రాజారం గ్రామానికి చెందిన మందుల అన్వేశ్ ఉత్తమ ర్యాంకు సాధించి పీజీటీ తెలుగు పండిట్ పోస్టుకు ఎంపికయ్యాడు. గురువారం హైదరాబాద్ నగరంలోని ఎల్బీ స్టేడియంలో రాష్ట్ర ప్రభుత్వం అందించిన నియామక పత్రాన్ని అన్వేశ్ అందుకున్నాడు.

సుప్రీంకోర్టు తీర్పుపై హర్షం

ఖమ్మంమయూరిసెంటర్: రాజకీయ పార్టీలకు నిధులు సమకూర్చేందుకు తీసుకొచ్చిన ఎన్నికల బాండ్లు చెల్లుబాటుపైన సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు హర్షణీయమని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, యర్రా శ్రీకాంత్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ తీర్పును స్వాగతిస్తున్నట్లు తెలిపారు.కాగా, ఎన్నికల బాండ్లను వ్యతిరేకిస్తూ సీపీఎం ఆలిండియా కార్యదర్శి సీతారాం ఏచూరితో పాటు ఇతర ప్రముఖులు సుప్రీంకోర్టులో పిటిషన్ వేసినట్లు చెప్పారు. బాండ్లు తీసుకురావడం ప్రజస్వామ్యానికి విరుద్ధమని అన్నారు.

బీఎస్పీ నిరసన

ఖమ్మం మామిళ్లగూడెం: రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం జన్వాడ గ్రామంలో మెధడిస్ చర్చిలో ప్రార్థనలు చేసుకుంటున్న క్రిస్టియన్ మైనార్టీలపై ఆర్ఎస్ఎస్ దాడిని బీఎస్పీ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు గురువారం దాడికి వ్యతిరేకంగా జెడ్పీ సెంటర్ అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఉపేంద్ర సాహు, పుల్లయ్య ఉదయ్, నాగేశ్వరరావు, శ్రీనివాస్, విజయ్, బాలరాజు, రమేశ్, అఫ్జల్, వంశీ, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ల్యాప్‌టాప్ వితరణ



ల్యాప్‌టాప్ అందిస్తున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం మామిళ్లగూడెం: నగరంలో ఎంబీఏ చదువుతున్న విద్యార్థిని కొచ్చెర్ల కీర్తనకు ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యాన డాక్టర్ వెలిగేటి విజయలక్ష్మి కొనుగోలు చేసిన రూ.40వేల ల్యాప్‌టాప్‌ను గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వీపీ గౌతమ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ డాక్టర్ వెలిగేటి చంద్రమోహన్, వైస్ చైర్మన్ ఆర్.రవీందర్ రావు, రాష్ట్ర పరిశీలకులు సాధినేని జనార్దన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాద సొసైటీకి కంప్యూటర్..



కంప్యూటర్ అందజేస్తున్న జడ్జి జగ్జీవన్‌కుమార్

ఖమ్మంలీగల్: న్యాయవాదులు, సహకార సంఘ బోర్డు సభ్యులు, సీనియర్ న్యాయవాదుల విజ్ఞప్తి మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి బీఎస్ జగ్జీవన్ కుమార్ సొసైటీ కార్యాలయానికి కంప్యూటర్ అందజేశారు. సొసైటీ కార్యాలయంలో లాసూట్ వెబ్‌సైట్ ద్వారా వివిధ ఉన్నత న్యాయస్థానాల జడ్జిమెంట్లు, కేస్ స్టేటస్ రిపోర్టులు పరిశీలించడానికి, జూనియర్ అడ్వకేట్లు కమీషన్ వర్క్ టైప్ చేసుకోవడానికి అందుబాటులో ఉంటుందని, దీనిని వినియోగించుకోవాలని సీనియర్ న్యాయవాదులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దిరిశాల కృష్ణారావు, న్యాయవాద సొసైటీ అధ్యక్షుడు రాజశేఖరరెడ్డి, న్యాయవాదులు బిచ్చాల తిరుమలరావు, మేకల సుగుణారావు పాల్గొన్నారు.

నేడు రథ సప్తమి..

సూర్య భగవానుడిని పూజించే పండుగ

ఖమ్మంగాంధీచౌక్: జీవరాశుల మనుగడకు సూర్యుడే ప్రధాన కారణం కావడంతో సూర్యున్ని భగవానుడిగా భక్తులు పూజిస్తారు. సూర్యుడు మాఘమాసం శుక్లపక్షం సప్తమి తిథిన ఏడు గుర్రాల రథమెక్కి ప్రయాణం సాగిస్తున్న నేపథ్యాన నేడు(శుక్రవారం) జరపనున్న రథ సప్తమిని పురస్కరించుకొని సూర్య భగవానునికి భక్తులు ప్రత్యేక పూజలు చేయనున్నారు. సూర్యుడికి ఇష్టమైన జిల్లేడు ఆకులు, రేగిపళ్లను భక్తులు తలపై పెట్టుకుని నదీ స్నానాలు ఆచరిస్తారు. ఇందుకు వేడుకలను జరుపుకునేందుకు పలు దేవాలయాల్లో ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

టీటీడీ ఆధ్వర్యంలో..

తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యాన ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం జిల్లాల్లో శుక్రవారం రథసప్తమి వేడుకలను నిర్వహిస్తున్నట్లు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా కో–ఆర్డినేటర్ రామకృష్ణారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నగరంలోని గుట్టలబజార్ శ్రీ రామకృష్ణ విద్యాలయం, కొత్తగూడెం పట్టణంలోని ఈకే విద్యాలయంలో విద్యార్థులచే సూర్య నమస్కారాలు తదితర కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు.

అలుపెరుగని పోరాటయోధుడు ధర్మబిక్షం



ఖమ్మంమామిళ్లగూడెం: నివాళులర్పిస్తున్న సంఘం నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మంమామిళ్లగూడెం: తుది శ్వాస వరకు పీడిత ప్రజల పక్షాన పోరాడిన అలుపెరుగని పోరాటయోధుడు బొమ్మగాని ధర్మబిక్షమని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, అఖిల భారత గీత పనివారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దూసరి శ్రీరాములు గౌడ్ తెలిపారు. ధర్మబిక్షం 102వ జయంతి సందర్భంగా గురువారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో హేమంతరావు, ఖమ్మం సంఘ కార్యాలయంలో శ్రీరాములు ధర్మబిక్షం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను అలవర్చుకున్న ధర్మబిక్షం సీపీఐ నాయకుడిగా, ఎమ్మెల్యేగా, ఎంపీగా విశేష సేవలను అందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎస్‌కె.జానిమియా, కొండపర్తి గోవిందరావు, పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, రావి శివరామకృష్ణ, జిల్లా అధ్యక్షుడు తొండల సత్యనారాయణగౌడ్, మల్లికార్జున, కల్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

తిరుమలాయపాలెం: మండలంలోని హస్నాబాద్‌లో రూ.10 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్ గురువారం శంకుస్థాపన చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధి సాధిస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బచ్చోడు ఎంపీటీసీ పాపనాయక్, గ్రామపంచాయతీ ప్రత్యేకాధికారి బాలత్రిపుర సుందరి, మాజీ సర్పంచ్ బొబ్బిలి భరత్ చంద్ర, పంచాయతీ కార్యదర్శి ఉష, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌ను కలిసిన ముస్తఫా



సీఎంతో ముస్తఫా

ఖమ్మంవన్‌టౌన్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని గురువారం జిల్లా కాంగ్రెస్ నాయకుడు ఎండీ.ముస్తఫా మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం కాంగ్రెస్ తరఫున రాజ్యసభ సభ్యురాలిగా రేణుకా చౌదరి అసెంబ్లీలో నామినేషన్ దాఖలు చేసిన సందర్భంగా కార్పొరేటర్ ఎండి.రఫీదా బేగం ఆధ్వర్యాన ముస్తఫా ఆమెను సత్కరించారు. ఈ కార్యక్రమంలో జొన్నలగడ్డ ప్రవంత్, షోయబ్, సత్యగౌడ్, పూజల శ్రీనివాస్, కొంపల్లి మహేశ్, యూసుఫ్, జస్వంత్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సెస్సీ విద్యార్థులకు టాలెంట్ టెస్ట్

ఖమ్మంమయూరిసెంటర్/కూసుమంచి: మండలాల్లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఖమ్మం నగరంలోని త్రివేణి పాఠశాలలో వైద్యుడు వినోద్‌బాబు, కూసుమంచిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం వీరస్వామి ప్రశ్నాపత్రాలను విడుదల చేసి పరీక్షను ప్రారంభించారు. విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించటం అభినందనీయమని, ఈపరీక్ష విద్యార్థుల్లో భయాందోళనలు పోగొట్టి వారు ఉత్తమ మార్కులు సాధించేందుకు దోహదం చేస్తుందని వారు అన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పోనుకుల సుధాకర్, నాయకులు రాజు, చరణ్, రవి, జీవన్, విజయ్, త్రివేణి స్కూల్ ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రవీణ్, రాష్ట్ర నాయకులు ఫర్వీస్, సంగీత, ఉదయశ్రీ, తదితరులు పాల్గొన్నారు.



కూసుమంచి హైస్కూల్‌లో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని శ్రీ గుంటుమల్లేశ్వర స్వామి ఆలయంలో శుద్ధ షష్టి సందర్భంగా గురువారం శ్రీ సుబ్రహ్మణ్యస్వామి కల్యాణ మహోత్సవాన్ని సంప్రదాయ పద్ధతుల్లో అర్చకులు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి చుండూరు రామకోటేశ్వరరావు పర్యవేక్షణలో అర్చకులు దాములూరి వీరభద్రరావు, దాములూరి కృష్ణశర్మలు స్వామి వారి కల్యాణ ఘట్టాన్ని నిర్వహించగా.. భక్తులు పాల్గొని పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

శ్రీలక్ష్మీతిరుపతమ్మ..

కామేపల్లి: మండలంలోని కొమ్మినేపల్లి గ్రామంలోగల తిరుపతమ్మ మాలధారుల సమక్షాన గురువారం రాత్రి గోపయ్యస్వామి సమేత శ్రీ లక్ష్మీతిరుపతమ్మతల్లి కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాలధారులు భజన పాటలతో సందడి చేయగా.. గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. నేడు(శుక్రవారం) గ్రామంలో ఉత్సవ విగ్రహాలను ఊరేగింపు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

20 నుంచి బ్రహ్మోత్సవాలు

కూసుమంచి: జీళ్లచెరువు గ్రామంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు శ్రీవారి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ బూర్లె వీరబాబు, ఈఓ నారాయణాచార్యులు గురువారం తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా 23న ధ్వజారోహణం, 24న స్వామివార్ల తిరుకల్యాణ మహోత్సవం నిర్వహించనున్నామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

గద్దెపైకి చేరిన సమ్మక్క



సమ్మక్కను తీసుకొస్తున్న భక్తులు

ఖమ్మంరూరల్: మండలంలోని మద్దులపల్లిలో మినీ మేడారం జాతర గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కోత్తగుట్టపై వేంచేసియున్న కాళికామాత ఆలయం నుంచి సమ్మక్కను దివ్యరథంపై ఊరేగింపుగా తీసుకొచ్చి గద్దెపైకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా భక్తులు తమ మొక్కులు చెల్లించుకోగా.. ఆలయ కమిటీ ఆధ్వర్యాన భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనుస్వామి, చౌదరి, సైదులు, లక్ష్మీనరసింహస్వామి, త్రిపురాంబ, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు ముస్తాబు

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెంలో నేడు (శుక్రవారం) నిర్వహించే శ్రీ కుసుమ హరినాథ కల్యాణ ఉత్సవాలకు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. గురువారం నుంచిప్రారంభమైన ఉత్సవాలు శనివారం వరకు కొనసాగనున్న సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆలయానికి రంగులు వేసి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

ఆలయానికి రూ.25 వేలు వితరణ



విరాళం అందిస్తున్న దాతలు

ఖమ్మంఅర్బన్: నగరంలోని 4వ డివిజన్ కైకొండాయిగూడెం క్రాస్‌రోడ్డులోని శ్రీ అంకమ్మ, శ్రీ మహాలక్ష్మమ్మ, శ్రీ మద్దిరావమ్మ అమ్మవార్ల దేవాలయ నిర్మాణానికి దాతలు ముందుకొచ్చి విరాళం అందించారు. గురువారం కొణిజర్ల మండలం తనికెళ్ల గ్రామానికి చెందిన గుండ్ల లాలమ్మ జ్ఞాపకార్థం భర్త నాగేశ్వరరావు, ఐదుగురు కుమారులు కలిసి రూ.25,116లను ఆలయ నిర్వాహకులకు విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో కుటుంబసభ్యులు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట

కామేపల్లి: మండలంలోని పండితాపురానికి చెందిన పోతనబోయిన రాంబాబు, వేగినాటి నవ్య కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. అయితే, వీరి పెళ్లికి అమ్మాయి కుటుంబీకులు నిరాకరించడంతో బుధవారం దేవాలయంలో వివాహం చేసుకున్నారు. అనంతరం తమకు రక్షణ కల్పించాలంటూ గురువారం పోలీసులను ఆశ్రయించగా, ఎస్సై ప్రవీణ్‌కుమార్ ఇరువురి కుటుంబాలకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు.

రోడ్డుప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కూసుమంచి: మండలంలోని చేగొమ్మ క్రాస్ వద్ద గురువారం రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనగా ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈమేరకు మండలంలోని జక్కుల్‌తండాకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు జర్పుల మోతీలాల్, ధర్మాతండాకు చెందిన మేగ్యా నాయక్ గాయపడగా స్థానికులు వీరిని 108లో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్

గిరిజనుల ఆరాధ్య దైవం సంత్‌శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన పెద్దలు సేవాలాల్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బోగ్ బాండారో కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సేవాలాల్ శ్రమ, దీక్షా నియమాలు బంజారా జాతికి నిదర్శనమని పలువురు పేర్కొన్నారు.

– సాక్షినెట్‌వర్క్



రఘునాథపాలెం: జింకలతండా క్రాస్‌రోడ్డు వద్ద వేడుకలు నిర్వహిస్తున్న గిరిజనులు



కామేపల్లి: జోగ్గూడెంలో నిర్వహించిన భోగ్ బండారోలో పూజలు చేస్తున్న భక్తులు



ఖమ్మంరూరల్: తెల్దార్‌పల్లితండాలో నివాళులర్పిస్తున్న బంజారా సంఘం నాయకులు



తిరుమలాయపాలెం: మండల పరిషత్ కార్యాలయంలో వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం